క్లుప్తంగా

సీఐటీయూ మండల నూతన కార్యవర్గ ఎన్నిక

చింతపల్లి: సీఐటీయూ మండల కన్వీనర్, కో–కన్వీనర్లుగా సాగిన చిరంజీవి పడాల్, పెంటమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతపల్లిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 16 రంగాలకు సంబంధించిన కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్, కో –కన్వీనర్‌తో పాటు మరో 23 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఈ కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమలను సన్మానిస్తున్న లబ్బూరు గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ సభ్యురాలు కమల సేవలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లబ్బూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు. సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమల, వార్డు సభ్యుడు శుక్రలకు దుశ్శాలువా కప్పి, సన్మానించారు.గత నాలుగు సంవత్సరాలుగా పంచాయతీ అభివృద్ధి పరుస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందుతున్న సర్పంచ్, ఎంపీటీసీలు పని చేసిన విధంగా ఎంతో ఆదర్శనీయమన్నారు. పంచాయితీ ప్రజలు చూపిన గౌరవపై సర్పంచ్, ఎంపీటీసీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామపెద్దలు జగబంధు, దశరధి, బద్దు, భగత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న సర్పంచ్ తదితరులు

కొయ్యూరు: చింతలపూడి పంచాయతీ భవనం నిర్మాణానికి రూ.32 లక్షలు రావడంతో ఆదివారం సర్పంచ్ సెగ్గే రమాదేవితో కలిసి కూటమి నాయకుడు ప్రసాద్ భూమిపూజ నిర్వహించారు. ఎం.మాకవరం సచివాలయం పరిధిలోకి చింతలపూడి వస్తుంది. దీంతో సచివాలయం ఎం.మాకవరంలో నిర్మించారు.తాజగా పంచాయతీ భవనం చింతలపూడికి మంజూరైంది. నాయకులు రామ్మూర్తి, పుల్లయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో అస్వస్థత



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పాముకాటు బాధితుడు

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ గ్రామనికి చెందిన సాగెరీ బాలరాజు అనే గిరిజనుడు ఆదివారం ఉదయం తమ పొలానికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు పాముకాటుకు గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సపర్యాలు చేసి వైద్య చికిత్స నిమిత్తం డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది బాధితుడికి చికిత్స అందజేశారు.

పశువులకు వ్యాక్సినేషన్



తోటకూరపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వీరేంద్ర

వై.రామవరం: మండలంలోని పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు మండల పశువైద్యాధికారి యూ.వీరేంద్ర తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని తోటకూరపాలెం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతు మండలంలోని 17 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో 4 నెలలు వయస్సు పైబడిన 22వేల పశువులకు, 300 గేదె జాతి పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయడానికి వ్యాక్సిన్ సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం గాలికుంట వ్యాధి లక్షణాలు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, పశువులన్నింటికి టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ వీరేంద్ర కోరారు.

దారుణ దారులు

- 9 కిలోమీటర్లు దెబ్బతిన్న తారురోడ్డు
- రాళ్లు తేలిన దారులపై రాకపోకలకు అవస్థలు
- అత్యవసర సేవలకు అంతరాయం
- ప్రభుత్వం, అధికారులు స్పందించాలని గ్రామస్తుల డిమాండ్



సీమకొండలో కోతకు గురైన రోడ్డు



గుల్లేలు - సీమకొండ రహదారి దుస్థితి

పెదబయలు: మండలంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో మన్యంలో దారులు చిత్తడిగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దారులు కోతకు గురైయ్యాయి. మండలంలోని గోమంగి రాయిమామిడి జంక్షన్ నుంచి గుల్లేలు మీదుగా ఇంజరి పంచాయతీ కోంద్రుం వరకు తారురోడ్డు నిర్మాణం జరిగింది. రాయిమామిడి జంక్షన్ నుంచి జంగంపుట్టు 9 కిలోమీటర్లు తారురోడ్డు 12 ఏళ్ల క్రితం నిర్మించారు.ఈ తారురోడ్డు కాస్త ప్రస్తుతం మట్టి రోడ్డును తలపిస్తోంది. గుల్లేలు కాజ్‌వే సమీపంలో చీమకొండ ఘాట్‌లో పూర్తిగా తారురోడ్డు చిత్తడి దారిగా మారింది. జంగంపుట్టు నుంచి కోంద్రుం వరకు తారురోడ్డుది అదే పరిస్థితి. ఆయా మార్గాలోల భారీ లోడుతో వస్తున్న వాహనాలతో ఈ రహదారి బాగా దెబ్బతింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాళ్లు తేలి పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తుంది. వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారికి మరమ్మతు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పర్యాటకుల అవస్థలు

మండలంలో ప్రసిద్ధి చెందిన పిట్టలబొర్రా(తారాబు) జలపాతం, ఇనుపతీగల జలపాతాలకు వెళ్లేందుకు ఈ మార్గం మీదుగానే పర్యాటకు వెళ్తుంటారు. ఈ మార్గంలో సుమారు 9 కిలోమీటర్లు రోడ్డు బాగా లేదని పలువురు చెబుతున్నారు. కప్పలగొంది గ్రామ సమీపం నుంచి పెదవంచరంగి మీదుగా డోమలొడ్డు, లింగారిపుట్టు గ్రామాలకు అనుసంధానం చేస్తూ నిర్మాణం చేయాల్సిన మెటల్ రోడ్డు అసంపూర్తిగా ఉందని చెబుతున్నారు. అధికారులు ప్రధాన రోడ్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

అధ్వాన దారితో నరకయాతన

పాడేరు రూరల్: మండలంలో పలు మారుమూల గ్రామలకు ఉన్న రహదారులు పూర్తిగా గోతులమయంగా మారింది. గుత్తులపుట్టు సంతబయలు నుంచి జల్లిపల్లి, అల్లివరం, నేరేడివలస, దుమ్మపుట్టు, కుంచ్చపల్లి, చింతగొంది తదితర గ్రామలతో పాటు సీడిమెట్ట నుంచి మొదలుకొని జి.మాడుగుల, పెదబయలు వివిధ మండలాలకు వెళ్లే మార్గాలు గోతులతో దర్శనమిస్తున్నాయి. నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోతకు గురైన జల్లిపల్లి- దుమ్మపుట్టు రహదారి

రహదారి నిర్మించాలి



మండలంలోని రాయిమామిడి జంక్షన్ నుంచి జంగంపుట్టు వరకు తారురోడ్డు దెబ్బతింది. పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా చీమకొండ ఘాట్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది.రోడ్డు బాగా లేని కారణంగా అత్యవసర 108.104, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు రోడ్డు బాగా లేదని రావడం లేదు. ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై అధికారులకు పలుమార్లు వినతులిచ్చినా స్పందించడం లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మించాలి.

– కొంటా శాంతికుమారి, గుల్లేలు గ్రామం, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని రాయిమామిడి జంక్షన్ నుంచి జంగంపుట్టు వరకు తారురోడ్డు పాడైంది. ఇటీవల కురిసిన వర్షాలకు సీమకొండ గ్రామం, ఘాట్ ప్రాంతంతో పూర్తిగా దెబ్బతింది. ఈ రహదారి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు దెబ్బతింది. తారురోడ్డు నిర్మాణం కోసం మరలా ప్రతిపాదనలు తయారు చేసి పంపిస్తాము. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే రోడ్డు నిర్మిస్తాం.

–నిక్కుల శివరామయ్య, మండల ఇంజనీరింగ్ అధికారి, పెదబయలు మండలం

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

చింతూరు: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి చేపట్టనున్న బైక్‌జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పండా కిష్టయ్య అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఈ కారణంగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయే ప్రమాదముందన్నారు. యోగాంధ్ర, మెగా పేరెంట్స్ సమావేశాల పేరుతో బోధనకు ఆటంకం కలిగించిందన్నారు. బైక్‌జాతా తూర్పుగోదావరి జిల్లాలో ప్రారంభమై విలీన మండలాల్లో కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.బైక్‌జాతాకు పోస్టర్లను ఆవిష్కరించారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం



చింతూరు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు



కించుమండలో హిందీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ జాతీయ భాష కావున హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. భాషా నైపుణ్యాలు పెంచుకునేందుకు, జాతీయ స్థాయిలో పరీక్షలు రాసేందుకు హిందీ ఎంతో దోహద పడుతుందన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి మాట్లాడేందుకు ఈ భాష అవసరం ఎంతైనా ఉంటుందని ఆయన సూచించారు. ఈ సందర్భంగా హిందీ భాషలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సీనియర్ అధ్యాపకులు వెంకట్రావు, అప్పనమ్మ, శకుంతల, హారతి, నాగమోహనరావు, మౌనిక, సాయికుమార్, శ్రీనివాసరావు, ఆనంద్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ ఎలిమెంటరీ పాఠశాలలో ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న హిందీ అర్హత పరీక్షలను ఐటీడీఏ హిందీ బోర్డు కన్వీనర్ శెట్టి సూరిబాబు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ మేరకు సూరిబాబు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ పరీక్షల్లో హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం ఉచితంగా కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సుమారు 29 మంది హాజరై పరీక్షలు రాస్తున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలన్నను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు




బాలన్నను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ పినజాగేరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, సచివాలయ కన్వీనర్ మఙుగూరు బాలన్న అనారోగ్యానికి గురై విశాఖపట్నం కెజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం సాయంత్రం పరామర్శించారు. బాలన్నకు అందుతున్న వైద్యం, ఆరోగ్య పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు.అక్కడ వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలన్నకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. బాలన్నకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విశాఖపట్నం కెజీహెచ్‌లో కొద్ది రోజులుగా అనారోగ్యంతో చేరి చికిత్స పొందుతున్న పినజాగేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మఙుగూరు బాలన్నను ఆదివారం జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు వేర్వేరుగా పరామర్శించారు.

రంగురాళ్ల తవ్వకాలను అడ్డుకోవాలి



రంగురాళ్ల తవ్వకాల వల్ల ఏర్పడిన గోతులను చూపుతున్న బాబూరావు

అడ్డతీగల: అడ్డతీగల మండలంలోని దుప్పులపాలెం, మల్లవరం మామిళ్ల గ్రామాలకు అనుకుని ఉన్న తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న రంగురాళ్ల అక్రమ తవ్వకాలను నిరోధించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు డిమాండ్ చేశారు. గొడ్డలి క్వారీలో యథేచ్ఛగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. బయట ప్రాంతాలకు చెందిన దళారులు స్థానికులతో కలసి తవ్వకాలు చేయిస్తున్నారన్నారు. ఈ క్వారీతో పాటు మల్లవరం మామిళ్ల సరిహద్దులోని తిరుపతమ్మ క్వారీని పరిశీలించగా ప్రమాదభరితంగా ఉన్నాయన్నారు. ముమ్మరంగా జరుగుతున్న ఈ తవ్వకాల వల్ల ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయన్నారు. రక్షిత అటవీ ప్రాంతాలతో పాటు రెవెన్యూశాఖ ఆధీనంలోని పట్టా భూముల్లోనూ జరుగుతున్న జరుగుతున్న రంగురాళ్ల తవ్వకాలను అధికారులు నిరోధించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కేసులు నమోదు చేయాలన్నారు.

క్షౌర వృత్తిదారుల సమావేశం నేడు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో బుధవారం జరిగే క్షౌ రవృత్తిదారుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాజవొమ్మంగి నాయీబ్రాహ్మణ మండల అధ్యక్షుడు త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. స్థానిక నాయీబ్రహ్మణ కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని, సంఘం చర్చించే పలు అంశాల్లో పాల్గొవాలని కోరారు. శ్రీనివాస్, బాబూరావు, సూరిబాబు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం



రాజవొమ్మంగిలో సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

రాజవొమ్మంగి: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుదామని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు పిలుపునిచ్చారు. రాజవొమ్మంగిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా రామరాజు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రామారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మిడ్డేమీల్ వర్కర్ల కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మిక చట్టాలను పటిష్టంగా అమలుచేయాలన్నారు. నాయకులు వెంకటలక్ష్మి, శ్రీను, సత్యవతి, వరలక్ష్మి, రత్నకుమారి తదితరులు హాజరయ్యారు.

సేవలతోనే గుర్తింపు



కాకునూరి కృష్ణార్జునరావును సన్మానించి, అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

కూనవరం: మండల పరిధిలోని చూచిరేవులగూడెం పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ కృష్ణార్జున ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరి కృష్ణార్జునరావుకు మహానంది పురష్కారం లభించింది. విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీలో తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ సేవా పురస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలం, చూచిరేవుల గూడెం పంచాయతీ, భీమవరం గ్రామానికి చెందిన కృష్ణార్జునరావును ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రం, మహానంది జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు సంస్కృతి సాహితి సేవా సంస్థ చైర్మన్ మాచవరం గౌరీశంకర్ మాట్లాడుతూ కృష్ణార్జునరావు తన స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. సేవలతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



లోదొడ్డిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చినబాబు



లబ్బర్తిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివకుమార్

రాజవొమ్మంగి: కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని లోతట్టు ప్రాంతం లోదొడ్డి గ్రామంలో ఆదివారం జడ్డంగి ఎస్‌ఐ చినబాబు తన సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశమై సామాజిక సమస్యలు, చట్టవిరుద్ధమైన పనులపై చర్చించారు. గంజాయి సాగు వల్ల నష్టాలు, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు, పొలానికి విద్యుత్ కంచెలు ఏర్పాటుచేయొద్దని హెచ్చరించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు వాలీ బాల్‌కిట్ అందజేశారు.

లబ్బర్తిలో..

గంజాయి సాగు, రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని రాజవొమ్మంగి ఎస్‌ఐ టి.శివకుమార్ అన్నారు. ఆదివారం సిబ్బందితో కలిసి ఆయన లబ్బర్తి గ్రామంలో స్థానికులతో సమావేశమయ్యారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంజాయి అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.